# వేన్నీళ్లకు చన్నీళ్లు

## కథానిక

శివలెంక ప్రకాశరావు

"గోపాలరావు గారు ఇంకా రాలేదా? ముహూర్తం సమీపిస్తోంది" అంటూ హడావిడిపడుతూ లోపలికీ బయటికీ తిరుగుతున్నాడు పురోహితుడు.

"ఇంకా గోపాలం రాలేదటే సీతమ్మా!" అంటూ దీర్ఘాలు తీస్తూ మరదలిని అడుగుతోంది ఆడబడుచు అనంతమ్మ.

"వాడెందుకొస్తాడే నాకు తెలుసు. డబ్బు చేతిలో పడ్డదిగా, ఏ క్లబ్బుకో పోయుంటాడు" అన్నాడు ఉక్రోషాన్ని వెళ్ళగక్కుతూ పెద్దన్న సుబ్బారావు గారు.

"లేదండీ! వెంటనే వచ్చేస్తానని మరీ మరీ చెప్పి వెళ్ళారు. ఏదో ముఖ్య కారణం ఉండి ఉంటుంది వారి ఆలస్యానికి" అంటూ సర్దిచెప్పబోయింది మరదలు సీతమ్మ.

"ఆ! నీ పిచ్చి గాని వాడెక్కడొస్తాడమ్మాయి. నువ్వు అలాగే మొదటి నుంచీ వెనకేసుకు రాబట్టే ఏ బాధ్యతా లేకుండా ఉన్నాడు వాడు. ఆరుగురు ఆడ పిల్లల తండ్రి అయినా, నలభై ఏళ్లు నెత్తిమీది కొచ్చినా నిమ్మకి నీరెత్తినట్టు ఉన్నాడు" అంటూ రంకెలు వేశారు సుబ్బారావు గారు.

దాంతో ఎవరూ నోరెత్తలేక పోయారు ఇంతలో విడిది యింటి నుంచి "కాఫీలు ఇంకా అందలే"దంటూ కబురు. "మంగళ సూత్రాలు సిద్ధపరచారాఅండీ" అంటూ పురోహితుడి ఎన్‌క్వయిరీ.

"కాలి గోళ్లు తీసేటప్పుడు కొత్త తుండు వెయ్యండమ్మా" అంటూ చాకలి హుకుం.

"కూరలింకా రాలేదండోయ్ అదీ కాక భోజనాలు పెందలాడే కావాలన్నారు పెద్దయ్య గారు" అంటూ వంటవాడి ఫిర్యాదు.

"మంగళా స్నానాలకు ఏర్పాటు చేయమంటున్నారు" అంటూ పెళ్లి కొడుకు తండ్రిగారి సందేశం.

"పెళ్లికుమారుడి ఫ్రెండ్స్ వచ్చారట! వాళ్లకు వేన్నీళ్లు అవీ ఏర్పాటు చేసి, వెంటనే టిఫిన్ రడీ చేయమంటున్నారు. అసలే వాళ్లు రాత్రి భోంచేయలేదట!" అంటూ మరో కబురు.

ఇవన్నీ చూస్తుంటే మతిపోయింది సుబ్బారావుకు. ఇంకా వెళ్లిన తమ్ముడు రాలేదు. పోనీ తానైనా ఏదన్నా సర్దుబాటుచేసి సరుకులూ అవీ తెప్పించుదామా అంటే రెండు నెలలనుంచీ జీతం రాక అఘోరించే బడిపంతుల ఉద్యోగం తనది. పిల్లకి చదివించాలిసిన పది రూపాయలకే పదిమందిని యాచించాలిసి వచ్చింది. రెండో తమ్ముడేమైనా సర్దుతాడేమో అంటే వాడు పెళ్లాం చేతిలో కీలుబొమ్మ. మూడో వాడు సరేసరి. తిరుపతి వెళ్లి పెళ్లి టైముకు వీలయితేవస్తానంటూ టెలిగ్రాం ఇచ్చాడు ముందుగానే జాగ్రత్త పడుతూ.

పరిస్థితి తారుమారయింది. పరువు బజారున పడేటట్టుంది. అదీకాక ఊళ్లో పెద్ద మనుషులుగా చెలామణీ అయ్యే కొందరు అప్పుడే "ఏమయ్యా! మీ

తమ్ముడు రాలేదట! ఏమిటీ విశేషం. అటుంనుంచి అటే ఎటన్నా....'' అర్థోక్తిలో వ్యంగ్యోక్తులు మొదలెట్టారు. అనరూ మరి! లోకులు కాకులు గదా!

అయినా వాళ్ల తప్పేముంది? గోపాలరావు సంగతి అందరికీ తెలిసిందే! పది రూపాయలు కనబడితే ఊళ్లో ఉండడని!

గోపాలరావు చేసే ఉద్యోగం గుమాస్తాగిరే! వచ్చే దానికి పది రెట్లు ఖర్చు ఇంట్లో. గంపెడు సంసారం. ఏం చేస్తాడు పాపం! అందుకే కాస్త పెట్టుబడితో ఎక్కువ లాభదాయకంగా ఉంటుందనే పిచ్చి నమ్మకంతో బ్రాకెట్ కంపెనీకీ, పేకాట మొదలైన జూదాలకూ అలవాటుపడ్డాడతడు. జూదంలో వచ్చే డబ్బే లెక్కిస్తారు. కాని పోయిన డబ్బుకు లెక్క ఉండదు కదా మరి! వేన్నీళ్లకు చన్నీళ్ళు తోడవుతాయని ఏదో ఆశ పాపం గోపాలరావుకు! అందుకే ఒక్కోసారి ముఖ్యంగా నెలలో మొదటి వారం రెండుమూడు రోజుల కొకసారి గాని ఇంటి మొహం చూడడు.

ఏది ఎలావున్నా పెద్దన్నగారి పట్టుదలవల్ల పెళ్ళికెదిగికూచున్న ముగ్గురిలో పెద్దదానికి సంబంధం కుదిరింది. పెద్దల ఆస్థి ఏనాడో హారతి కర్పూరం అయింది. అంతా రెక్కలమీదే ఆధారం. అందుకే గోపాలరావు చేసేదిలేక తప్పించుకు తిరిగాడు చాలా రోజులు.

ఎలాగయితేనేం! కాస్త స్తోమతుగల అక్క గారు ఖర్చంతా పెట్టుకుంటా ననడంతో అన్నింటికీ గంగిరెద్దులా తలూపాడు. క్రిందటి రోజే ఖర్చులకని అయిదు వందలు చేతిలో పోసింది ఆమె. బయటపడ్డాడు గోపాలరావు.

చెయ్యి తిరిగితే పెళ్ళి ఇంకా ఘనంగా చెయ్యొచ్చని క్లబ్బుదారిపట్టాడు. ఈసారి పెద్దజట్టులో కూచున్నాడు. మొదట రెండు వందలదాకా వచ్చాయి. దాంతో ఇంకా ఆశ కల్గింది గోపాలరావుకు. అలాగే ఆడసాగాడు. తెచ్చిన దానిలో మూడొందలు పోయాయి. కసి పెరిగింది. ఇంకా ఆడుతూనే ఉన్నాడు. తెల్లారే సరికి ఒక్క పది నోటు బిక్కుబిక్కుమంటూ తొంగి చూస్తోంది జేబులోంచి. అప్పటికి కాని తన స్థితి గుర్తు రాలేదు గోపాలరావుకు. ఇంకేం ఇంటికెళ్తాడు!

పరిస్థితి విషమించిందని తెలిసికొన్న అక్కగారు, చాటుగా సుబ్బారావును పక్కకు పిలిచి "అన్నయ్యా! ఏమను కొని లాభం లేదు. వాడు వచ్చేదాకా పెళ్ళి ఆగదు. ఈ నాలుగొందలూ తీసుకొని వెంటనే ఊళ్లో ఉన్నంతవరకూ సామాను తెప్పించు. పది రూపాయ లెక్కువైనా సరే! పని నడుస్తూ ఉంటుంది. ఇంతలో వాడొస్తే సరేసరి. లేదా అంతా అభాసుపాలు అవుతాం'' అంటూ రొండిన దాచిన నాల్గు నోట్లు అందించింది.

ఏనుగంత బలం వచ్చింది సుబ్బారావుకు. వెంటనే అన్ని ఏర్పాటూ చేశాడు క్షణంలో.

కనీసం కన్యధార వేళకయినా గోపాలరావు వస్తాడోరాడోఅని అంతా ఎదురు చూడసాగారు. అవసరమయితే దానికి సిద్ధమయాడు సుబ్బారావు. ఏంచేస్తాడాయన? ఏదో కట్నంలేకుండా పిల్లాడు రెండో పెళ్ళి వాడయినా దొరికాడు కదా అంటే ఈ అవాంతరం వచ్చి పడింది. మళ్ళీ ఇలాంటి సంబంధం దొరకదు.

పెళ్ళి పీటలు సిద్ధపరిచారు. పిలిచిన వారంతా వేషాలువేసుకొని వస్తున్నారు.

ఇంతలో .... సైకిలు గంట మోగింది. చిన్నగా దిగాడు గోపాల రావు. మొహం పీక్కుపోయింది. ప్రాణాలు కళ్లల్లో ఉన్నాయి. తూలి పోతున్నాడు. పెరిగిన గడ్డం, చిరిగిన గుడ్డలు.

అందరూ అతని వెనకాల వచ్చే సామానుకోసం దిక్కులు చూశారు. అతని పరిస్థితిని చూసి అడుగుదామను కున్నవారు నిర్ఘాంతపోయారు. వేడి కాఫీ యిచ్చి సేద తీర్చారు.

అర్థం చేసుకున్న పెద్దన్నగారి హుంకరింపుతో అందరూ మామూలుగా తమ పని తాము చేసుకోసాగారు. "సమయానికి వచ్చాడు. అంతే చాలు" అనుకున్నారు చుట్టాలు.

నిరాటంకంగా పెళ్ళి జరిగింది అనిపించాడు సుబ్బారావు గారు.

అయితే పట్టుకెళ్ళిన డబ్బంతా క్లబ్బుకు చేరిందని ఒక్క సీతకే తెలుసు.

పాపం! ఏంచేస్తుంది?

చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవా!

## వ్యత్యాసం

వై. పురుషోత్తమ రెడ్డి

ఈ కిటికీలో నుండి చూస్తున్నా -
చింకి పాతల దుస్తులేని
కూడులేని బొచ్చె బట్టి
బిచ్చానికి పయనమైన
కటిక దరిద్రుడు
కడుపు మంటలో
తుంట బీడీ ముట్టించు కోవడం -

కాయంలో తడినంతా
డబ్బులకై విక్రయించి
సారాతో శరీరాన్ని
తడిచేసుకు బతుకుతూన్న
లేని వాన్ని -
కుటుంబాన్ని పోషించలేని వాన్ని -

శరీర పోషణకై -
సంఘంలో నీచంగా
వీధుల్లో 'చీపు'గా
శరీరాన్ని అమ్ముకునే
అమ్మల్ని, దిగజారిన రొమ్ముల్ని -

తన తాతల 'స్టేటస్సు' ను-
నిలుపో బెట్టేటందుకు;
నలుగురిలో మెప్పుకొరకు
అభిమానం లప్ప కొరకు -
గొప్పలు పోయి
అప్పుల పాలయిన అప్పారావ్
తనలో తనుగొణుక్కుంటూపోవడం

ఊరకుక్క ఊరకనే
కాట్లాడుకు చస్తూంటే
ఎదురింట్లో వేటకుక్క
విలాసాతి దరహాసపు చూపుజూసి
నిశ్చలంగా 'భౌవ్'కరించడం-

సింపుల్‌గా ముస్తాబై
ఇంపాలా కారులోన
జంపాలా ఊగుతున్న
కంపులరావుని -
వాడి ఇంపోర్టెడ్ వైఫ్‌ని -

కాని -
ఒక అనుమానం-
దేవుడి దృష్టిలో అందరూ సమానం
మరి ఈకిటికీలో ఎందుకీవ్యత్యాసం?